

# మసిమాపు

సాకి

వామనరావు ఉద్యోగంకోసం సిమ్లా వచ్చి అప్పుడే మూడు నెలలు దాటింది. ఒట్టిచేతుల్తో యింటికి తిరిగిపోకూడదనే నిశ్చయంమూలంగా యిక్కడే, ఒక పెద్ద బట్టలదుకాణంలో సేల్స్‌మన్‌గా చేరేడు, 120 రూకల జీతంమీద. అది జూన్ మాసం. ఇక్కడి పరిస్థితుల్నిబట్టి ఆ రోజున గాలిపు ఎక్కువనే చెప్పాలి. రిడ్జ్‌మీద చిన్న పొదుగ్గావున్న చోట, ఒక గోరింటపొద కానుకునివున్న సిమెంటు బెంచిమీద కూర్చుని, కింద వచ్చిపోయే జనాన్ని చూస్తున్నాడు, వామనరావు. ఆరోజెందుకనో చిరాకుగా నిస్పృహగా వున్నాడు. ఏపనీలేకపోయినా, ఏదో పెద్ద మునిగిపోతూన్నట్లు, హడావిడిగా తిరుగుతున్నారు ఆడా మొగా. కొంతమంది, గుంపులుగా రోడ్డుకడ్డంగా నిలబడి బాతాఖానీ వేస్తున్నారు.

చదువు సంధ్యలూ, తెలివితేటలూ తక్కువయినా, శుభ్రమైన ఖరీదైన దుస్తుల్లో, సుఖమైన జీవితాలు గడుపుతూన్న యీ పంజాబీలనుచూస్తే, వామనరావుకి వొళ్లుమండుతుంది. ఆమాటకొస్తే ఎవడికిమండదు? అంటే, పంజాబీలంతా భాగ్యవంతులని కాదు. అక్కలించుకుపోయిన పొట్టలతో, చలికి గజగజవణికే గర్భదరిద్రులకి యిక్కడాలోటులేదు. వామనరావు గౌరవప్రదంగా యూనివర్సిటీనుంచి వుత్తీర్ణుడయ్యేడు. ఉద్యోగార్హతలన్నీ వున్నాయి, వొకటి తప్ప. ప్రభుత్వ పదవుల్లో అతని బంధు వెవరూ లేడు పాపం!

మెల్లమెల్లగా అంధకారం అలుముకుంటూంది. కొంచెం చలివేస్తున్నా, బద్ధకించి అక్కడే కూర్చున్నాడింకా. ఆలోచనలు వింత ముఖాల ప్రవహిస్తున్నాయి. చీకటి...కాదు చీకటి...జీవితంలో సాఫల్యం పొందలేక నిరాశచెందిన నిర్భాగ్యులకూ, డబ్బున్నా కొన్ని కారణాలచేత కోరికలు ఫలించక భగ్నహృదయులైన వారికీ, దొంగలకూ, దోపిడిగాళ్ళకూ, వ్యభిచారులకూ చీకటి గుండెదిటవునిచ్చి, ఆశ్రయమిస్తుంది. గబ్బిలాల్లా ఆ చీకటిలో ప్రజలకు చూపెడ్తారు తమ ముఖాలు. తనకుకూడా ఏదో నాలుగొందలు జీతం వొచ్చే వుద్యోగం దొరక్కూడదూ? చూపెడ్తాడు మరి అప్పుడు, జీవించడమెట్లాగో. డబ్బున్నా, మనపక్క, పీనాసి వెధవలు. ఒకడికీ మాసిన పంచ తప్ప, సూటు వెయ్యడం ఎట్లాగో తెలియదు. తనైతేనా?- ఇంటిదగ్గర అమ్మావాళ్లూ ఏం చేస్తున్నారో? ఈ చచ్చు జీతంలోంచి వాళ్ళకు పంపించడం ఎట్లా?

బలవంతాన ఆలోచనల్లోంచి బయటపడుతున్నాడు, వామనరావు. తన ప్రక్కనేకూర్చున్న నలభై అయిదేళ్ళ వ్యక్తిని పరికించేడు. వేషధారణనుబట్టి, బీదవాడని చెప్పలేం కాని, ధనికుడు మాత్రంకాదు. భుజాన కూరల సంచీ, చేతిలో ఆఫీసు కాగితాల కట్టావున్నాయి. ఏ ఆఫీసులోనో చిన్న వుద్యోగస్తుడో, గుమాస్తాయో, అయివుంటాడు. ఈ మధ్య తరగతి మేధావుల కంతకంటే పెద్ద వుద్యోగా లెక్కడనుంచి వస్తాయి? ఆయన కూడా వామనరావు లాంటివాడే అయివుంటాడు.

అప్పటికే కించుమించు పూర్తిగా చీకట్లలముకున్నాయి. ఏభై గజాల దూరంలోని లాంతరు స్తంభంనుండి వెల్తురు కొద్దిగా, వాళ్లు కూర్చున్న బెంచి దగ్గరకూడా పడుతూంది. ఆ పెద్ద మనిషి యింటికి పోడానికి తయారుగా సంచీ సరిచేసుకొని, కోటు బొత్తాలు బిగించి, లేచి నడకసాగించేడు. ఆయన ఖాళీచేసిన స్థలంలో ఆ అవకాశం కోసమే ఎదురు చూస్తూన్నట్లు ఎవరో యువకుడు వెంటనే చతికిలపడ్డాడు. చాలా దూరం కాళ్ళీడ్చీలా తిరిగి వచ్చినట్లు, 'అమ్మయ్యా' అన్నాడు. అతని వాలకం చూసి ఎట్లాంటివాడో చెప్పడానికి వీలులేదు. అంతా తెల్లగానే వుంటారు, గుడ్డలు కాస్త శుభ్రంగావుంటే, యీ పంజాబీల్లో; ధనికుడ్నీ బీదవాణ్ణీ, వేరుగాచెప్పడం కష్టం. వామనరావుకు హిందూస్తానీ బాగావచ్చును. పలకరించేడు :

'చాలాదూరం తిరిగొచ్చినట్లు ఆయాసంగా కనిపిస్తున్నారే ?'

'నాస్థితిలోవుంటే మీరూ యిట్లానేవుందురు. నేనెప్పుడూ చెయ్యని తెలివితక్కువపనొకటి చేసి కూర్చున్నాను' అన్నాడా ఆగంతుకుడు.

'నిజంగా ?'

'ఈరోజు వుదయమే, అమృత్‌సర్ నుంచి యిక్కడదిగేను! స్టేషన్‌లోనే ఎవరో హొటల్ ఏజంట్లగపడి, అక్కడకు తీసుకుపోయేరు. సామాను పడేసి, స్నానంచేసి, భోజనంచేసి, నా అడ్రస్ మావాళ్ళకుత్తరం రాసిపడేసేను. కాసేపు విశ్రమించేక, మాల్‌కి బయల్దేరి, సబ్బు తెచ్చుకోలేదని జ్ఞాపకంవచ్చి ఒకటి కొనుక్కుని, షికారుకొట్టేను కాసేపు. తీరా హొటల్‌కు పోదామనుకునేసరికి, దానిపేరూ, అది ఏ ప్రాంతంలోవుందో కూడా మరిచిపోయేను. చాలావీధులు తిరిగి వెతికేను. ఎక్కడా కనపడలేదు. కాఫీతాగి, సబ్బుకొన్నాక జేబులో యింక ముప్పావలాఅర్ధణా మిగిలింది. మావాళ్ళకు టెలిగ్రాం యిచ్చి, నేరాసిన ఎడ్రస్ తెప్పించుకుందామంటే, ఆ వుత్తరం వాళ్ళకి రేపు సాయంత్రంకాని అందదు. పైగా టెలిగ్రాం యివ్వడానికి నాదగ్గర డబ్బు సరిపోదుకూడా. ఈ రాత్రి కెక్కడ గడపాలో తెలియకుండా వుంది' అని వుసూరు మన్నాడు. 'బహుశా, వీడెవడో దొంగ వెధవరా అనుకుంటున్నారేమో మీరు. నే చెప్పిన విషయం నమ్మడం కష్టమే మరి.'

'అబ్బెబ్బే! నమ్మకేం! ఇట్లాంటివి జరుగుతూనే వుంటాయి. నాకు సరిగ్గా యిట్లాగే జరిగింది కలకత్తాలో' అన్నాడు వామనరావు.

'ఏ పుణ్యాత్ముడో కొంచెం దయతలిస్తే తప్ప, యీ రాత్రి యీ బెంచిమీదే గడపవలసి వుంటుంది. ఖర్మం! యిక్కడ చలికూడా ఎక్కువ' అన్నాడు. ఆ పుణ్యాత్ముడు వామనరావే అని తన దృఢనమ్మకం అన్నట్లున్నాయి ఆ మాటలు.

'మీ కథలోకల్లా కష్టమైన పాయంట్, మీరు కొన్నానన్న సబ్బు చూపెట్ట లేకపోవడమే!' అన్నాడు.

ఆ యువకుడు గబుక్కున లేచి నిలబడి, కోటు జేబులు తడుముకుని వెర్రిమొహం వేసేడు.

'నస్తగలెయ్యా, ఇదికూడా ఎక్కడో పారేసుకున్నాను.' అన్నాడు కోపం నటిస్తూ.

'హోటల్ పేరు మర్చిపోయేరు. సబ్బుకూడా పారేసుకున్నారు. పాపం యిది చాలా దుర్దినం మీకు!' అని వెక్కిరించేడు వామనరావు. అతడు సమాధానం చెప్పడానికేం లేక, అక్కడినుంచి కాలు సాగించేడు.

'ఈ దొంగపీనుగ చెప్పిన కథలోకల్లా నమ్మదగ్గ విషయం సబ్బు కొనుక్కుందుకు బజారుకు పోయే నన్నది. దాంట్లోనే టోకరా తిన్నాడు. కాస్త జాగ్రత్తపడి, ముందే ఒక సబ్బు జేబులో వేసుగుంటే, యీ బాధలేక పోనుగా! హుఁ హుఁ! మనకే టోకరా యిద్దామనుకున్నాడు.' అనుకుంటూ, ఆత్మ సంతృప్తితో వామనరావు కూడా లేచేడు. యింటికి పోడానికి పక్కనేవున్న హేట్ తీసుకోడానికి వొంగినపుడు, దీపపు వెల్తురులో, బెంచికింద ఏదో కనిపించింది. ఆతృతతో, అది తీసిచూసేడు. కొత్త సబ్బు బిళ్ల.

వామనరావు గతుక్కుమన్నాడు. అతన్ని అకారణంగా అనుమానించినందుకు తన్ను తనేతిట్టుకుంటూ తిరిగి చూసే సరికి, అతడు రిట్జ్ మీద

తలవొంచుకు వేగంగాపోతున్నాడు. సబ్బు చేతపట్టుకుని, నాలుగడుగుల్లో అతన్ని కలుసుకున్నాడు.

'ఏమండోయ్! మీ కథ నిజమని రుజువు చెయ్యడానికి సాక్ష్యందొరికింది. ఇదిగో మీరు పోయిందనుకున్న సబ్బుబిళ్ళ. మిమ్మల్ని అనుమానించినందుకు క్షమించండి. ఈ నాలుగు రూపా

యలూ మీ కేవిధంగానైనా ఉపకరించగల వంటే...' అన్నాడు వామనరావు.

అవి వుపకరించగలవనడంలో సందేహాని కేమాత్రం ఆస్కారంలేదని ఆత్రుతతో రుజువు చేసేడాతడు.

'ఇదిగో, నా యెడ్రసు. వారంరోజుల లోగా మీకు వీలైనపుడు తిరిగి యిచ్చెయ్యొచ్చు. ఆ సబ్బును మాత్రం మళ్ళీ పారేసుకోకండేం!' అని ఛలోక్తి విసిరేడు వామనరావు. ఆయువకుడు కంగారుగా తన థాంక్సు చెప్పి, సెలవు తీసుగున్నాడు. ఈ హడావిడిలో, బెంచి మీద తన హేట్ మరిచిపోయిన సంగతి జ్ఞాపకం వచ్చి, అటు నడిచేడు. యీలేసుగుంటూ.

'పాపం! ఎంతబాధపడ్డాడో. అవును మరి పరిస్థితి అట్లాంటిదికి! ఇది నాకు మంచి పాఠంలే! ప్రతీవాణ్ణీ అనుమానించడ మోజబ్బు నాకు' అని ఆత్మవిమర్శన చేసుగున్నాడు కూడా.

వామనరావు బెంచీ దగ్గరకొచ్చే సరికి, ఎవరో నడికారు మనిషి బెంచీకిందా, పక్క గోరింటపొద కిందా తెగ వెతుకుతున్నాడు. ఆయన యిదివరకు అక్కడకూర్చుని, యింటికి బయల్దేరిన పెద్దమనిషే.

'ఏదేనా పడిపోయిందాండి?' అన్నాడు వామనరావు తన హేట్ అందుకుంటూ.

'అవునండి. సబ్బు బిళ్ళ.'

# జయపూర్ జల్సా

## సి. సీతారామ్

జనసమూహపు టొత్తిడిలో దెబ్బలుతిన్న ఒక పత్రికాప్రతినిధి అన్నట్లు, 50 లక్షల వ్యయంతో సమావేశమయిన జయపూర్ కాంగ్రెస్ ఒక పెద్ద 'గోల్ మాల్'. 50 లక్షలు ఖర్చయినందుకు ఎవరూ విచారించినట్లు కనపడరు. విచారించవలసిన అవసరమూ కనిపించదు. ఎవరో దాచిపెట్టిన సొమ్మురు కదలికకలిగి కొన్నివేల కూలి జనానికి భుక్తి లభించడమేకాకుండా దేశపు నలువైపుల ప్రజలూ ఒకచోచేరి నిత్యజీవితపు కష్టాలు మరచి సంతర్పణల హడావుడిలోపడి సంతోషంగా నాలుగురోజులు సుఖస్వప్నంలా వెళ్ళబుచ్చారు.

భారతదేశంలోని అన్నిరకాల మనుష్యులూ అక్కడికి చేరారు. విమానాల్లో వచ్చిన కోటీశ్వరులదగ్గర్నుంచి కాలినడకపై అక్కడికి చేరిన రాజస్థానీయుల వరకూ, సంఖ్య సుమారు మూడులక్షలుండవచ్చు. కాని ఇంతమందీ రాజకీయాలలో పాల్గొనేందుకు వచ్చినవారుకారు. ఒక ప్రఖ్యాత విలేఖరి తనపత్రికకు వ్రాసినట్లు బహిరంగ సమావేశానికి కూడిన జనాభాను చూస్తే ఆస్ట్రేలియా జ్ఞాపకంవచ్చింది. మనుష్యులకంటె మైళ్లు ఎక్కువగల దేశంగదా అది!

రాజస్థానీ నిర్మాణనైపుణ్యం, వివిధరాష్ట్రాల నుంచి వచ్చిన నట నాట్యబృందములు ఆనందాన్ని కల్గించాయి. గడ్డి, వాసములతో ముఖ్యమయిన ద్వారములు, బాపుమండపము ను ఇంద్రమగర్, గోవర్ధన్ జోషీలు అతిరమ్యంగా నిర్మించారు. ప్రత్యేకంగా నిర్మింపబడిన తపాలాఫీసు మూడు లక్షల మాటలయినా పత్రికలకు తీగలమీద అందించింది. భోజనవసతులు చక్కగా జరిగాయి. మంచి నెయ్యి రాజస్థానంలో తప్ప ఇంకెక్కడా దొరకదేమో ననిపిస్తుంది. అక్కడ తాగిన టీలో పాలు ఒంటెపాలని అక్కడికి వెళ్ళివచ్చిన పెద్దలందరికీ తెలియదు. వేలగాలన్లు పెట్రోలు లెక్కలేకండా తగలబడింది. రంగురంగుల వస్త్రాలతో విచిత్రపు ఆభరణాలతో రాజస్థానీ స్త్రీలు సమావేశానికి మంచి అందాన్ని కల్గించారు. 1000 మంది యువకులు, 1000 మంది యువతులు వాలంటీర్లుగా పనిచేశారు.